ప్రజాశక్తి

గురువారం 20 మార్చి, 2025

5

శ్రీకాకుళం

సీనియార్టీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

శ్రీకాకుళం అర్బన్: జిల్లావ్యాప్తంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సాధారణ సీనియార్టీ జాబితాను వెబ్‌సైట్‌లో, డిఇఒ కార్యాలయంలోని నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచామని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. అందులో అభ్యంతరాలు ఉంటే ఈనెల 22వ తేదీ లోగా తెయాజేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ, జిల్లాపరిషత్ , మున్సిపాలిటీ, కార్పొరేషన్, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఈ జాబితాను సరిచూసుకోవాలన్నారు. ఉద్యోగి గుర్తింపు కార్డు, జాబితాలో తప్పిదం ఎక్కడ ఉందో స్పష్టమైన వివరాలు, ఆధారాలు జత చేసి అభ్యంతరాలు తెలపాలన్నారు. గడువు తర్వాత వచ్చిన అభ్యంతరాలు స్వీకరించబడవని స్పష్టం చేశారు. మరిన్ని వివరాల కోసం 9000907101, 8555820983, 6304115238, 9515255657 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'యాప్' సోపాలు

- సరిగా పనిచేయని మొబైల్ ఫోన్లు
- సాంకేతిక సమస్యలతో యాప్‌లో నమోదు కాని లబ్ధిదారుల వివరాలు
- ఫేస్ ఎన్‌రోల్‌మెంట్ తక్కువ ఉందనే పేరుతో అధికారుల మెమోలు
- ఆందోళనలో అంగన్‌వాడీలు

జిల్లా మహిళా శిశుఅభివృద్ధి సంస్థ (ఐసిడిఎస్) ద్వారా పలురకాల అంగన్‌వాడీ కార్యక్రమాల అమలు కోసం ప్రభుత్వం తీసుకొస్తున్న రోజుకో యాప్‌తో అంగన్‌వాడీలు నానా అవస్థలు పడతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పలురకాల సేవలను కార్యకర్తలు ఇప్పటికే పోషణ్ ట్రాక్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. సాంకేతిక సమస్యలు, మొబైల్ ఫోన్లు సరిగా పనిచేయకపోయినా ఏదో రకంగా నెట్టుకొస్తున్నారు. ఇప్పుడు తాజాగా ఏడు నెలల నుంచి మూడేళ్ల పిల్లల ఫేస్ ఎన్‌రోల్‌మెంట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో, తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారు. యాప్ సరిగా పనిచేయని పరిస్థితి ఒకవైపు ఉండగా, మరోవైపు అధికారులు మెమోలు జారీ చేస్తుండడంతో ఏం చేయాలో వారికి తోచడం లేదు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలోని 16 ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 3,358 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు 2,759, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 599 ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మొత్తం 1,18,159 మంది లబ్ధి పొందుతున్నారు. వీరిలో 8,738 మంది గర్భిణులు, 11,422 మంది బాలింతలు ఉన్నారు. వీరితో పాటు మూడు నుంచి నుంచి ఆరు సంవత్సరాల పిల్లలు 42,978 మంది, ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల వయసు కలిగిన చిన్నారులు 55,021 మంది లబ్ధి పొందుతున్నారు. ఆయా కేటగిరీలకు ప్రభుత్వం నిర్ధేశించిన వంట సరుకులు, ఆహార పదార్థాలు అందిస్తున్నారు. అంగన్‌వాడీలో జరుగుతున్న ప్రతి కార్యక్రమంపై పర్యవేక్షణ కోసం 2023లో నాటి వైసిపి ప్రభుత్వం పోషణ్ ట్రాక్ యాప్‌ను తీసుకొచ్చింది. అందులో రకరకాల కార్యక్రమాలతో పాటు గర్భిణులు, బాలింతల ఫొటోలను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఫోన్లు సరిగా పనిచేయకపోయినా, సిగ్నల్స్ లేకపోయినా నానా అవస్థలు పడి తమకు ఇచ్చిన పనిని పూర్తి చేశారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఏడు నెలల నుంచి మూడేళ్ల చిన్నారుల ఫొటోలనూ నమోదు చేయాలని చెప్పడంతో, వారిపై మరింత పనిభారం మోపినట్లయింది.

ఫేస్ ఎన్‌రోల్‌మెంట్ నమోదు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త (ఫైల్)

యాప్‌తో నానా అవస్థలు

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు, చేపడుతున్న కార్యక్రమాలపై యాప్‌లో నమోదు చేయడాన్ని గత వైసిపి ప్రభుత్వం తప్పనిసరి చేసింది. అక్కడ నుంచి వారికి కష్టాలు మొదలయ్యాయి. కేంద్రం పరిధిలోని మొత్తం జనాభా, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల వివరాలతో నమోదు చేస్తున్నారు. వీటితోపాటు పిల్లల పెరుగుదల, రేషన్ పంపిణీ వంటి అంశాలనూ అందులో పొందుపరిచేవారు. ప్రతినెల ఒకటి, నాలుగో వారాల్లో జరిగే సమావేశాలు, గర్భిణులు, బాలింతలకు సన్మానాలు వంటి వివరాలను పొందుపరుస్తున్నారు. వీటితో పాటు టేక్‌హోం రేషన్, పోషణ్ వేడుకలు, ఇమ్యూనైజేషన్ వంటి అంశాలనూ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంతో పాటు మారుమూల గ్రామాలకు సిగ్నల్స్ లేకపోవడంతో యాప్‌లో వివరాల నమోదుకు నానా అవస్థలు పడ్డారు. మరోవైపు ప్రభుత్వం అందించిన ఫోన్లు సరిగా పనిచేయకపోవడంతో తమ కుటుంబసభ్యులు, తెలిసిన వారి ఫోన్ల సాయంతో ఏదో రకంగా వివరాలను నమోదు చేశారు. ప్రభుత్వం ఇప్పుడు ఏడు నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లల ఫొటోలను తీసి అప్‌లోడ్ చేయాలని చెప్పడంతో వారికి ఏం చేయాలో తోచడం లేదు.



అధికారులు జారీ చేసిన మెమో కాపీ

అంగన్‌వాడీలకు మెమోలు జారీ

ఫోన్లు సరిగా పనిచేయక ఒకవైపు, సిగ్నల్స్ లేక మరోవైపు అంగన్‌వాడీలు ఇబ్బంది పడుతుంటే వీటిని పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు వారికి మెమోలు జారీ చేయడం కార్యకర్తలను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. పోషణ్ ట్రాకర్‌లో లబ్ధిదారుల ఫేస్ ఎన్‌రోల్ చేయాలని అధికారులు ఇచ్చిన సూచనలను పాటించకుండా స్కిప్ కొట్టారని, లబ్ధిదారులు లేకుండా ఫేస్ ఎన్‌రోల్ చేసినట్లు భావిస్తున్నట్లు కార్యకర్తలకు ఇచ్చిన మెమోలో పేర్కొన్నారు. ఐసిడిఎస్ అధికారులు ఇచ్చిన సూచనలను పాటించి ఉద్యోగ బాధ్యతలను నిర్తరించాల్సింది పోయి నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ మెమోలో తెలిపారు. శాఖపరమైన చర్యలు ఎందుకు తీసుకోకూడదో, రెండు రోజుల పాటు గౌరవ వేతనం ఎందుకు నిలుపుదల చేయకూడదో ఒక రోజులోగా సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. తమ ఇబ్బందులను పరిష్కరించకుండా మెమోలు జారీ చేయడంపై అంగన్‌వాడీ కార్యకర్తలు మండిపడుతున్నారు.

యాప్‌లో నమోదు చేయాల్సిందే

ప్రభుత్వ సూచనల మేరకు పోషణ్ ట్రాక్ యాప్‌లో ఫేస్ ఎన్‌రోల్‌మెంట్ నమోదు చేయాల్సిందే. అంగన్‌వాడీ సేవలు అత్యవసర విభాగం పరిధిలోకి వస్తాయి. లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉంది. యాప్‌లో వివరాలు నమోదు చేయకపోతే లబ్ధిదారులు నష్టపోతారు. ప్రభుత్వం తీసుకునే చర్యలకు గురికాకుండా యాప్‌లో నమోదు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి.

- శాంతిశ్రీ, ఐసిడిఎస్ పీడీ

మెమోల పేరుతో బెదిరించడం సరికాదు

ఫేస్ ఎన్‌రోల్‌మెంట్ కోసం అంగన్‌వాడీ కార్యకర్తలపై ఒత్తిడి చేయడం సరికాదు. యాప్ సరిగా పనిచేయక నానా అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం మంచి ఫోన్లు ఇస్తే పనిచేయడానికి ఇబ్బందేమీ లేదు. ప్రభుత్వం, అధికారులు సమస్యలు పరిష్కరించకుండా, మెమోలు జారీ చేసి కార్యకర్తలను అందోళనకు గురిచేయడం మానుకోవాలి.

- డి.సుధ, జిల్లా ప్రధాన కార్యదర్శి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

కొత్తూరు : ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

గిరిజన ఉత్పత్తులను జిసిసి కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - కొత్తూరు

గిరిజన ఉత్పత్తులని జిసిసి ద్వారా ఎందుకు కొనుగోలు చేయడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండలంలోని ఇరపాడుగూడ, కొత్తగూడ, గొట్టుపల్లి, భూతలగూడ తదితర గ్రామాల్లో ప్రజా చైతన్యయాత్రను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిసిసి, అటవీశాఖ మధ్య 21 రకాల గిరిజన ఉత్పత్తులను 2027 వరకు కొనుగోలు చేస్తామని అగ్రిమెంట్ చేసి కొనుగోలు చేయకపోవడంతో, గిరిజనులు తీవ్ర దోపిడీకి గురవుతున్నారని విమర్శించారు. గిరిజన ఉత్పత్తులను బయట వర్తకులు కొంటే అటవీశాఖ అధికారులు ఫైన్లు వేయడంతో, గిట్టుబాటు ధర లేక తీవ్ర అన్యాయం గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడిపిక్కలు 80 కేజీల బస్తాకు రూ.16 వేలు చెల్లించి రాష్ట్ర ప్రభుత్వం జిసిసి ద్వారా, రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. జిల్లాలో షెడ్యూల్ ఏరియాతో కూడిన ఐటిడిఎని ఏర్పాటు చేయాలని కోరుతూ ఈనెల 25వ తేదీన చేపట్టే చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఐటిడిఎ లేకపోవడంతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులు సాగు చేస్తున్న కొండపోరంపోగు, బంజర భూములకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన భూములను గిరిజనేతరులు తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించుకుంటున్నా, ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిఒ నంబరు 3 అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రామారావు, ముఖలింగం, కృష్ణ, రమణ, మోహన్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని బెండి గ్రామంలో నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో ఎపి రైతుసంఘం నాయకులు ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. బెండి గేటు నుంచి నువ్వలరేవు వరకు తారు రోడ్డును వెంటనే పూర్తి చేయాలని, ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలని రైతుసంఘం మండల అధ్యక్షులు కొర్నాన బాలాజీరావు, నాయకులు హేమసూదనరావు డిమాండ్ చేశారు.

వజ్రపుకొత్తూరు : ప్రచారం చేస్తున్న రైతు సంఘ నాయకులు

22నుంచి కెజిబివి ప్రవేశాలకు దరఖాస్తులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలోని కస్తూరిబా విద్యాలయాల్లో 6, 11 తరగతుల్లో 2025-26 విద్యా సంవత్సరంలో చేరేందుకు గానూ ఈనెల 22వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. వీటితో పాటు 7, 8, 9 తరగతుల్లో చేరేందుకు ఆసక్తి ఉండి, మిగులు సీట్లు భర్తీలో చేరేందుకు వీలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

రైస్‌మిల్లు కార్మికులకు...

కనీస వేతనాలు వర్తింపజేయాలి

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

రైస్‌మిల్లు కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు అమలు చేయాలని రైస్‌మిల్లు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. రైస్‌మిల్లు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా 4వ మహాసభను కోటబొమ్మాళిలో బుధవారం నిర్వహించారు. కొత్తపేట జంక్షన్ నుంచి కోటబొమ్మాళి సంతమైదానం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రైస్‌మిల్లు కార్మికుల యూనియన్ జిల్లా కన్వీనర్ హెచ్.ఈశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడుతూ రైస్‌మిల్లుల యాజమాన్యాలు కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు చట్టబద్ధమైన సౌకర్యాలు అమలు చేయకుండా తీవ్ర శ్రమదోపిడీకి గురిచేస్తున్నాయని విమర్శించారు. రైస్‌మిల్లుల యాజమాన్యాలు కార్మికులపై నిర్లక్ష్య వైఖరి వీడి వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైస్‌మిల్లు కార్మికులు బస్తాలు మోసినప్పుడు నడుం జారినా, యంత్రాల వద్ద ప్రమాదాలకు గురైనా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని, వారికి ఎటువంటి ఆసరా ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐఎల్ఒ నిబంధనల ప్రకారం బస్తా బరువు 50 కిలోలకు మించి ఉండకూడదని కానీ వంద కిలోల వరకు బరువులు మోయాల్సి వస్తోందన్నారు. బస్తా బరువు 50 కిలోలకు మించకుండా జిల్లా యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు చట్టప్రకారం పిఎఫ్, ఇఎస్ఐ, విడిఎ, గ్రాట్యుటీ అమలు చేయాలని, బోనస్ ఇవ్వాలని మహాసభలో తీర్మానించారు.

మాట్లాడుతున్న వాసుదేవరావు

నూతన కమిటీ ఎన్నిక

మహాసభలో రైస్‌మిల్లు వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కె.సూరయ్య, అధ్యక్షులుగా కె.కేశవరావు, ప్రధాన కార్యదర్శిగా హనువంతు ఈశ్వరరావు, ఉపాధ్యక్షులుగా గొండు నీలన్న, టి.లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శులుగా డొక్కర కామయ్య, ఎస్.ఆనందరావు, కోశాధికారిగా బోర శ్రీనుతో పాటు 15 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మహాసభలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా కార్యదర్శి హెచ్.ఈశ్వరరావు, నంబూరు షణ్ముఖరావు, కె.సూరయ్య పాల్గొన్నారు.

వెనుకబడిన కుటుంబాలకు చేయూత

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అత్యంత వెనుకబడిన 20శాతం కుటుంబాలకు చేయూతనిచ్చి, వారిని ప్రోత్సహించి ప్రగతి పథం వైపు నడిపించడానికి 'ప్రభుత్వ, ప్రైవేట్ ప్రజల భాగస్వామ్యం' (పి-4) దోహదపడుతుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పి-4 కార్యక్రమంపై బుధవారం నిర్వహించిన అభిప్రాయ సేకరణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రవాసాంధ్రుల సంపన్న కుటుంబాలను భాగస్వాములను చేసి, వారి సహకారంతో వెనుకబడిన కుటుంబాలను ఆదుకుంటామన్నారు. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, వారికి తగిన మార్గదర్శకత్వం, ఉపాధి అవకాశాలు కల్పించి దీర్ఘకాలికంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. పేద ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకురావడానికి సహాయపడుతుందన్నారు. పి-4 కార్యక్రమంలో ప్రభుత్వం సమన్వయకర్తగా వ్యవహరిస్తుందన్నారు. సమాజంలోని కుటుంబాలు ఒకరికొకరు సహాయం చేసుకునేలా ప్రోత్సహిస్తుందని తద్వారా స్వయం నిర్వహణ కలిగిన వ్యవస్థను నిర్మించి, ప్రజల నిజమైన అవసరాలను తీర్చడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా భాగస్వామ్యాలను బలోపేతం చేసి, స్పష్టమైన ఫలితాలు సాధిస్తామన్నారు. స్వర్ణాంధ్ర-2047 దార్శనికతను సాకారం చేసుకోవడానికి ప్రభుత్వం అన్ని వర్గాల సహకారాన్ని కోరుతోందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, సిపిఒ ప్రసన్నలక్ష్మి, పలు శాఖల అధికారులు, పలు పరిశ్రమల ప్రతినిధులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

డ్రగ్స్ రహిత సమాజం అందరి బాధ్యత

బిఆర్ఎయు వైస్ ఛాన్సలర్ కె.ఆర్ రజని

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై అందరూ కలసికట్టుగా పోరాడాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ కె.ఆర్ రజని పిలుపునిచ్చారు. క్యాంపస్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యాన 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా 'డ్రగ్స్‌పై యుద్ధం - అవగాహన - మార్పు' అనే అంశంపై బుధవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల సమాజంలో మానవతా విలువలు దిగజారుతున్నాయన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ తమ లక్ష్యాలు, తల్లిదండ్రుల ఆశయాల సాధనకు విద్యార్థులు దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే నిత్యం నిరాశ, నిస్పృహల్లో జీవితం గడపాల్సి ఉంటుందన్నారు. వర్శిటీ రెక్టార్ బి.అడ్డయ్య మాట్లాడుతూ మాదకద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట వేస్తే వాడకాన్ని నివారించవచ్చన్నారు. రిజిస్ట్రార్ పి.సుజాత మాట్లాడుతూ పాశ్చాత్య దేశాల్లో ఉన్న డ్రగ్స్ సమస్య జిల్లాలోనూ పెరగడం ఆందోళనకరమన్నారు. డ్రగ్స్ వల్ల యువత జీవితాలు ఛిన్నాభిన్నమవుతాయన్నారు. ఎస్ఐ సందీప్ కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల రవాణాను కొంతమంది వ్యాపారంగా చేసుకొని అందులోకి యువతను దించుతున్నారని తెలిపారు. ఆ ఉచ్చులో విద్యార్థులు పడొద్దని సూచించారు. డ్రగ్స్ నివారణకు పోలీస్ శాఖతో ప్రతిఒక్కరూ కలిసి పనిచేయాలని కోరారు. వర్శిటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి సాయిప్రదీప్ డ్రగ్స్ నివారణకు రూపొందించిన ప్రత్యేక యాప్‌ను విసి రజని ఆవిష్కరించారు. డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్గించేలా విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బిఆర్ఎయు వైస్ ఛాన్సలర్ రజని

పనిచేయనప్పుడు జీతాలు ఎందుకు..?

డ్వామా పీడీ బి.సుధాకరరావు

ప్రజాశక్తి - కంచిలి, పలాస

బాధ్యతాయుతంగా అధికారులు పనిచేయనప్పుడు జీతాలు ఎందుకు ఇవ్వాలని డ్వామా పీడీ బి.సుధాకరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కంచిలి మండల పరిషత్ కార్యాలయం వద్ద, పలాస ఎన్ఆర్ఇజిఎ కార్యాలయ ఆవరణలో 2023-24 ఆర్థిక సంవత్సర సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పంచాయతీల్లో చేపట్టిన పనులు, పర్యవేక్షణా లోపంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలాచోట్ల మస్టర్లలో కూలీలకు సంబంధించి వేలిముద్రలు, సంతకాలు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. హాజరు సైతం సరిగా వేయని అధికారులు వేతనాలు ఎలా చెల్లిస్తున్నారంటూ ప్రశ్నించారు. జీతాలు నిలుపుదల చేస్తే తప్ప సక్రమంగా పనులు చేయరా అంటూ మండిపడ్డారు. కొలతల్లో తేడాలు, పనుల్లో నిర్లక్ష్యంపై పలువురు సిబ్బందిపై జరిమానాలు వేశారు. పనులకు సంబంధించి వ్యత్యాసాలు ఉన్నచోట రికవరీలకు ఆదేశించారు. అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరు బాగాలేకపోతే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. కూలీలకు ఉపాధి పనులు కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్లు అలసత్వం వహిస్తున్నట్లు ప్రజావేదిక ద్వారా తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రతి గ్రామంలో 90 శాతం కూలీలకు పనులు కల్పించని ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ఫీల్డ్ అసిసెంట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని రకాల పనులు చేపడుతుందో తెలియని పరిస్థితిలో ఉంటే, కూలీలకు ఏం మేలు చేస్తారని ప్రశ్నించారు. బాధ్యతగా పనిచేసిన వారినే కొనసాగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిడి శ్రీనివాస్ రెడ్డి, విజిలెన్స్ అధికారులు స్వరూపరాణి, శ్రావణ్ కుమార్, పి.రాధ, ఎస్ఆర్‌పి తిరుపతిరావు, కంచిలి జెడ్‌పిటిసి ఇప్పిలి లోలాక్షి, ఎంపిపి దేవదాస్ రెడ్డి, ఎపిఒలు ధనుంజయ్, శంకరరావు, డిఎల్‌డిఒ ఎన్.రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డ్వామా పీడీ సుధాకరరావు

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శక్తి యాప్‌తో మహిళలు, విద్యార్థినులకు రక్షణ, భద్రత లభిస్తుందని మహిళా పోలీస్‌స్టేషన్ సిఐ త్రినేత్రి అన్నారు. ప్రతి మహిళ శక్తి యాప్‌ను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని రిజిస్ట్రేషన్ కావాలన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలులోని జెమ్స్ మెడికల్ కళాశాల, టెక్కలి, కాశీబుగ్గ పట్టణ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను శక్తి బృందాలు సందర్శించి శక్తి యాప్ ఆవశ్యకత, ప్రాధాన్యతపై శక్తి బృందాలు బుధవారం అవగాహన కల్పించాయి. శక్తి యాప్‌లో గానీ డయల్ 112 నంబరుకు కాల్ చేస్తే ఆపదలో ఉన్న వారిని పోలీసులు పది నిమిషాల్లో రక్షించే చర్యలు చేపడతారని చెప్పారు.

ఆత్మరక్షణపై శిక్షణా తరగతులు

ఆత్మరక్షణ కళపై విద్యార్థినులకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిపుణులైన శిక్షకులతో శిక్షణా తరగతులు నిర్వహించారు. మహిళలపై దాడి జరిగే సమయంలో రక్షించుకోవడం చాలా అవసరమని సిఐ త్రినేత్రి అన్నారు. అందుకోసం ఈ శిక్షణా తరగతులు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, ఎస్ఐ చంద్రకళ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పూజిత

సాయితనూజ

'గేట్'లో పూజితకు 25వ ర్యాంకు

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని వంజంగికి చెందిన పైడి పూజిత బుధవారం విడుదలైన గేట్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 25వ ర్యాంకు సాధించింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో విఎన్ఐటి యూనివర్శిటీలో ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతోంది. పూజిత తండ్రి శ్రీనివాసరావు ఎల్.ఎన్ పేట మండలం ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి ఆదిలక్ష్మి గృహిణి. పూజిత గేట్ పరీక్షలో వంద మార్కులకు గానూ 73 మార్కులు సాధించారు. గేట్‌లో ర్యాంకు సాధించి ప్రతిభ కనబర్చడంపై కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెరిసిన సాయి తనూజ

సోంపేట : గేట్ ఫలితాల్లో సోంపేట పట్టణానికి చెందిన బల్ల సాయి తనూజ ఆలిండియా స్థాయిలో 396వ ర్యాంకు సాధించింది. సాయి తనూజ సోంపేటలోని మహర్షి విద్యానికేతన్‌లో పదో తరగతి, విశాఖపట్నంలో ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్, గుంటూరు నాగార్జున యూనివర్శిటీలో బిటెక్ పూర్తి చేసింది. 2022లో ఇంజినీరింగ్ పూర్తి చేసిన తనూజ అనంతరం హైదరాబాద్‌లో శిక్షణ తీసుకుంది. సాయి తనూజ తండ్రి జానకిరావు విశాలాంధ్ర సోంపేట మండల విలేకరిగా పనిచేస్తున్నారు. తల్లి జయమ్మ గృహిణి. ర్యాంకు సాధించడంపై సాయి తనూజను కుటుంబసభ్యులు, స్థానికులు అభినందించారు.

మాట్లాడుతున్న ప్రసాద్

గిరిజన సమస్యల పరిష్కారానికి చలో కలెక్టరేట్

ప్రజాశక్తి- బూర్జ

గిరిజన ప్రాంతాల్లో సమస్యల పరిష్కారం చేయాలని ఈ నెల 25న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. గిరిజన ప్రాంతాల్లో నేటికీ కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. ముఖ్యంగా పోడు భూములకు పట్టాలు, పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గిరిజన భూములను కార్పొరేట్ సంస్థకు అప్పగించి గిరిజనులను కొండల నుంచి దూరం చేయొద్దన్నారు. గిరిజన సమస్యలు పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాకు అన్ని ప్రాంతాల నుంచి గిరిజనులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం నాయకులు కంట అప్పలనాయుడు, నాయకమ్మ, రాజు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి- పోలాకి

స్థానిక విశ్వకర్మ నగర్‌కు మౌలిక వసతులు కల్పించాలని వాసులు కోరారు. ఈ మేరకు ఎంపిడిఒ జి.రవిమాచార్యను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ ఇళ్ల పట్టాలు 2005లో ప్రభుత్వం ఇచ్చిందన్నారు. సుమారు 150 కుటుంబాలు శాశ్వత నివాసాలు ఏర్పాటు చేసి నివసిస్తున్నారని పేర్కొన్నారు. 20 ఏళ్లు గడిచినా గడిచినా కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిసి రోడ్లు కొన్ని వీధుల్లో మాత్రమే వేశారని అన్నారు. డ్రెయిన్ వ్యవస్థ అధ్వానంగా ఉందన్నారు. సామాజిక భవనం, చిన్నారుల పార్కు మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఎంపిడిఒ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో యావాజి రాము, లక్ష్మీ గోరీశంకర్ పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు

ప్రజాశక్తి- పలాస

కళ్యాణ చక్రవర్తి, డిటి

మండలంలోని శాసనం కోర్టు ఎదురుగా ఉన్న భూమిపై సోషల్ మీడియా ఇటీవల పలు అసత్య కథనాలు విడుదల చేసి దానికి తహశీల్దార్ బాధ్యులుగా చేర్చడం తగదని డిటి టి.కళ్యాణచక్రవర్తి అన్నారు. ఈ మేరకు తన కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. శాసనం రెవెన్యూ పరిధి పలాస కోర్టు ఎదురుగా సర్వే నంబరు 191/3 గ్రామం రీసర్వే అనంతరం ఎల్‌పిఎం నంబరు 317లో ఉన్న 85 సెట్లు స్థలం జిరాయితీ భూమి బి.వాసుదేవ పేరున రికార్డుల పరిధిలో ఉందన్నారు. 1958 సర్వే సందర్భంగా ఆ భూమి జిరాయితీగా ఫెయిర్ అడంగల్ రికార్డులో ఉందన్నారు. ప్రయివేటు వ్యక్తులు వారి భూమిని ఏమి చేసుకున్నా తమకు సంబంధం ఉండదని, కానీ, కొంత మంది రెవెన్యూ అధికారులపై నిందలు వేయడం సరికాదని పేర్కొన్నారు. జిరాయితీ భూములపై రెవెన్యూ సిబ్బంది అజమాయిషీ ఉండదని, ప్రజలు గుర్తించి తమపై అభియోగాలు చేసిన వారిపై చట్ట పర్యంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అవగాహన కల్పిస్తున్న సుడా అధికారులు

ఎంఐజి లబ్ధిదారులకు అవగాహన

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో నిర్మిస్తున్న ఎంఐజి లేఅవుట్లలో లబ్ధిదారులతో సుడా అధికారి జె. పి.ఒ.శాస్త్రి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్ర మాట్లాడుతూ 240 చదరపు అడుగుల స్థలాల విషయంలో 10 శాతం ప్రభుత్వం ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యోగుల కోటా పూర్తిచేసి జనరల్ కోటాలో ఇస్తామని అన్నారు. లేఅవుట్-1 లో రానివారికి అవుట్-2లో లబ్ధిదారులకు ఇచ్చిన తర్వాత లేఅవుట్-1లో రానివారికి ఇస్తామని ప్రకటించారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. లాటరీ పూర్తిగా రద్దు చేశామని మళ్లీ కొత్తగా తీస్తామని ప్రకటించి మళ్లీ ఎలా ఎక్కడ ఆపేశారో అక్కడ నుంచే చేస్తామంటూ కుదరదని స్పష్టం చేశారు. 240 చదరపు గజాల స్థలం అందరికి ఇస్తామని ప్రకటించి మళ్లీ ఇలా చెబుతున్నారేంటి అంటూ అధికారుల తీరుపై మండిపడ్డారు. చివరకు లబ్ధిదారులకు 240 చదరపు అడుగుల స్థలం ఇవ్వాలని, లేదంటే తామంతా కోర్టుకు వెళ్తామని పేర్కొన్నారు. సమావేశంలో పిఒ అమర్నాథ్, భవన ఇన్‌స్పెక్టర్ మోహన్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆర్‌టిసిలో యాజమాన్యం ఉద్యోగులందరిని సమానంగా చూడాలని, కొన్ని యూనియన్లపై వివక్షత చూపడం తగదని ఎన్‌ఎంయు జిల్లా కార్యదర్శి ఎంఎన్‌రావు ఆరోపించారు. బుధవారం నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో ఎన్‌ఎంయు ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యం ఏకపక్ష దోరణితో కొందరు ఉద్యోగులపై వివక్షత చూపుతున్నారన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ మద్దతుతో కండక్టర్‌ను వేరే డిపో నుంచి తీసుకొచ్చి శ్రీకాకుళం - 1 డిపోకి రిలీవింగ్ డ్యూటీ ఇచ్చారని, ఈ ఆర్డర్ ప్రకారం ఈ నెల 15తో కాలపరిమితి ముగిసినప్పటికి శ్రీకాకుళం 1వ డిపోలోనే కొనసాగిస్తూ కండక్టర్, డ్రైవర్ డ్యూటీ చార్ట్ కౌన్సిలింగ్‌లో ఆయనకు ప్రాధాన్యతనిస్తూ సీనియారిటీ జాబితాలో చేర్చారన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ నాయకులకు ఆర్‌టిసి యాజమాన్యం, డిపో యాజమాన్యం ప్రాధాన్యతనిస్తూ మిగిలిన యూనియన్ల అభ్యర్ధనలను సైతం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పంథా కొనసాగితే సహించేది లేదని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో ఎన్‌ఎంయు నాయకులు కె.నరసింహులు, నవీన్, ఎంఎస్ రాజు, కె.టి.రావు, వి.డి.రావు, ఆర్‌ఎస్ చలం తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఎన్‌ఎంయు నాయకులు

రైల్వే గేటు కష్టాలు ఎన్నాళ్లు?

- గంటల తరబడి వేచి ఉండాల్సిన వాహనదారులు
- ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్

ప్రజాశక్తి- పొందూరు

రైలు వచ్చి గేటు పడితే చాలు ఎంత సమయం వేచి ఉండాలో తెలియదు. ఒక్కోసారి గేటు మొరాయించిందంటే చాలు గంటల తరబడి వేచి ఉండాల్సిందే. సమయానికి చేరుకోలేక నిత్యం రాకపోకలు సాగించే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు ఎన్నో దశాబ్దాలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని పొందూరు, సంతకవిటి మండలాల ప్రజల దుస్థితి. పొందూరు రైల్వేస్టేషన్ సమీపంలోని కొంచాడ వద్ద గల రైల్వేగేటు తొలగించి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలనేది పొందూరు, సంతకవిటి మండలాల్లోని పలు గ్రామాల ప్రజల చిరకాల స్వప్నం. దేశంలోని అన్ని రైల్వేగేట్ల స్థానంలో

గేటు వేయడంతో వేచి ఉన్న వాహనదారులు

ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాసేజ్‌లు నిర్మాణం జరుగుతున్నప్పటికీ ఇక్కడ ప్రజలు మాత్రం బ్రిడ్జి నిర్మాణానికి నోచుకోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లావాసుల అవస్థలు

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని పొందూరు, సంతకవిటి మండలాల ప్రజలు రైల్వేగేటు స్థానంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలంటూ కోరుతున్నారు. పొందూరు మండలంలోని తుంగపేట, లైదాం, గోరింట, కొల్లిపేట, యాగాటిపేట, గోకర్ణపల్లి, తాడివలస, లచ్చయ్యపేట గ్రామాలతో పాటు విజయనగరం జిల్లా సంతకవిటి మండలంలోని సిరిపురం, కావలి, వాల్తేరు, పనసపేట, బూరాడపేటతో పాటు మరికొన్ని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామాల ప్రజలు పొందూరు మండల కేంద్రం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ గేటును దాటాల్సిందే. ఉద్యోగులు సకాలంలో విధులకు వెళ్లలేకపోవడం, విద్యార్థులు పరీక్షల సమయంలో ఇబ్బందులు పడడం వంటివి చోటు చేసుకుంటున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ఎన్నో దశాబ్దాలుగా ఈ రెండు మండలాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఫ్లై ఓవర్ నిర్మాణం కోసం గత ప్రభుత్వాలు కాని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కాని ఎటువంటి ప్రతిపాదనలు చేయలేదంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఫ్లై ఓవర్ నిర్మాణం కోసం పార్టీలకు అతీతంగా ఉద్యమించాలని ఆయా గ్రామాల ప్రజలు భావిస్తున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రస్తుత కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్‌లను కలిసి వినతిపత్రం అందించేందుకు సమాయత్త మవుతున్నారు.

అక్రమ దుకాణాలను తొలగిస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

ఎట్టకేలకు పాఠశాల ఆవరణలో షాపుల తొలగింపు

- పోలీసు, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో కూల్చివేత
- 'ప్రజాశక్తి' కథనంతో ఆక్రమిత స్థలం పాఠశాలకు అప్పగింత

లావేరు: మండల కేంద్రంలోని జెడ్‌పి పాఠశాల స్థలాన్ని ఆక్రమించి అందులో 14 షాపులు అక్రమ నిర్మాణాలు చేపట్టారు. అయితే ఎట్టకేలకు కలెక్టర్ ఆదేశాలతో పోలీసులు, రెవెన్యూ అధికారులు పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ లంకలపల్లి రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం జెసిబితో షాపులను కూల్చివేశారు. పాఠశాల ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ అనే శీర్షికతో ఇటీవల ప్రజాశక్తిలో కథనం రావడంతో దీనిపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పందించారు. సమగ్రమైన సర్వే నిర్వహించి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు ఫిబ్రవరి 22న వెంటనే సర్వే నిర్వహించారు. షాపులు పాఠశాల స్థలంలోనే ఉన్నట్లుగా నిర్ధారణకు వచ్చాక షాపులను వారంరోజుల్లో ఖాళీ చేస్తే తొలగిస్తామని తహశీల్దార్ జోగారావు షాపుల యజమానులను హెచ్చరించారు. దీంతో కొన్ని రోజుల తర్వాత ఒక్కొక్కరుగా షాపుల్లోని సామగ్రి తీసి ఖాళీ చేశారు. దీంతో బుధవారం మధ్యాహ్నం 5 గంటల సమయంలో జెసిబితో పోలీసులు, రెవెన్యూ అధికారులు దగ్గరుండి పాఠశాల స్థలంలో అక్రమంగా నిర్మించిన దుకాణాలను నేలమట్టం చేశారు. దీంతో ఆ స్థలంలో రక్షణ గోడ నిర్మాణ పనులు చేపట్ట నున్నారు. ఆక్రమణలు తొలగించడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ 'ప్రజాశక్తి' కి కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి అంగన్వాడీలకు శిక్షణ

ఆమదాలవలస: ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో గల అంగన్వాడీ కార్యకర్తలకు ఈనెల 20 నుంచి 22 వరకు మూడు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఐసిడిఎస్ పిఒ ఎస్. అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా తరగతుల్లో 'పోషణ బి పడాయి భి' శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అలాగే ఐసిడిఎస్ సర్వీసెస్, న్యూట్రిషన్, ఆదర్శిలా, నవ చేతన వంటి నూతన విద్యా విధానాలపై కార్యకర్తలు అందరికీ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆరోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి నిర్వహించనున్న ఈ శిక్షణా తరగతులకు ప్రాజెక్టు పరిధిలో గల కార్యకర్తలందరూ విధిగా పాల్గొనాలని ఆమె పేర్కొన్నారు.

మంత్రి లోకేష్‌తో కుమార్

లోకేష్‌ను కలిసిన కుమార్

సోంపేట: మండలంలోని బారువకు చెందిన టిడిపి నాయకులు మడ్డు కుమార్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. అమరావతిలో ప్రభుత్వ బెందాళం అశోక్‌తో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బారువ గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంత మత్స్యకారులు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న కొండిరేవు వంతెన నిర్మాణానికి కృషి చేయాలన్నారు. అలాగే మహేంద్ర తనయా నదిపై ప్రధాన వంతెన గురించి తెలియ జేశారు. మే నెలలో వంతెన పనులు చేపట్టేందుకు లోకేష్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

మండల ఎఒగా శ్రీదేవి

కవిటి: మండల ఎఒగా పిరియా శ్రీదేవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. సీతంపేటలో వ్యవసాయ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీదేవి బదిలీపై కవిటి వచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఎఒ బడగల దుర్గాప్రసాద్, ఎఇఒ బెందాళం శ్రీకళ్యాణ్, మండలంలోని వ్యవసాయ సహాయకులు ఆమెకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం తెలిపారు.

పి-4 సర్వేకు సహకరించాలి

ఇచ్ఛాపురం : సచివాలయం ఉద్యోగుల ద్వారా ప్రభుత్వం చేపడుతున్న పి4 సర్వేకు ప్రతి మహిళా సంఘాల సభ్యులు సహకరించాలని వెలుగు ఎపిఎం ప్రసాదరావు సూచించారు. మండలంలోని మండపల్లి గ్రామ సంఘ సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హోమ్ కంపోస్టు, కిచెన్ గార్డెన్, ఇంకుడు గుంతలు, ప్లాస్టిక్ వద్దు, పిఎం సూర్య ఘర్ యోజన పథకాల గురించి వివరించారు. పుస్తక నిర్వహణ, రుణాలు పొందడం, తిరిగి చెల్లింపు సంఘాల గ్రేడింగ్, ప్రకృతి వ్యవసాయం, నవధాన్యాలు ప్రాముఖ్యత, రసాయన ఎరువులు వాడకుండా జీవ ఎరువులు వాడే విధానంలో మార్పు రావాలని, పౌష్టికాహారం, ప్రాధాన్యత అవగాహన కల్పించారు. సమావేశంలో సిసి లక్ష్మి, విఒఎ లలిత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిఎం ప్రసాదరావు

ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

ఎమ్మెల్యే దృష్టికి మండల సమస్యలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని సమస్యలను పరిష్కరించాలని టిడిపి మండల మాజీ అధ్యక్షులు అనపాన రాజశేఖరరెడ్డి కోరారు. ఈ మేరకు విజయవాడలో ఉన్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో అర్హులైన వంద మంది పేదవారికి నివాస స్థలం, ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఉద్దానం వాటర్ గ్రిడ్ నుంచి మెళియాపుట్టి రక్షిత తాగునీటి సరఫరాకు కొత్త కనెక్షన్ ఏర్పాటు చేసి నిరంతరాయంగా నీటిని అందించాలని కోరారు. చింతలగాదింగారి చెరువు ఆయకట్టు రైతులకు, పెద్దపద్మాపురం లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి కొత్తగా కనెక్షన్ ఏర్పాటు చేసి సాగునీరు అందించాలని కోరారు. స్థానిక రాజావీధి, పొంద వీధుల్లో తాగునీరు వాటర్ స్కీమ్ మరమ్మతులు చేయాలని కోరారు. మండల కేంద్రంలోని మహేంద్ర తనయా నది నుంచి ఒడిశా సరిహద్దు ప్రాంతం భిన్నాల వరకు బిటి రోడ్డు, ఎన్ఎం రోడ్డు నుంచి కోనేటి చెరువు వరకు సిసి రోడ్ మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే స్పందించి సమస్యలు పరిష్కారానికి హామీనిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు హనుమంతు చంద్రశేఖరరావు, బమ్మిడి భాస్కరరావు, విష్ణుప్రసాద్ పండా, వరిసి శోభన్, దుక్క శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సిసిఇ బృందం మహిళా కళాశాల సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్వయం ప్రతిపత్తి గల శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాల నాక్ అసెస్మెంట్‌లో భాగంగా 2023-2025 వార్షిక సంవత్సరాలకు సంబంధించిన ఆడిట్‌ను సిసిఇ బృందం చేపట్టింది. ఈనెల 17 నుంచి మూడు రోజుల పాటు చేపట్టిన వార్షిక అకడమిక్ ఆడిట్‌ను సిసిఇ బృందం చేపట్టింది. ఈ బృందంలో ఒఎస్‌డిలు డాక్టర్ కె.విజయబాబు, డాక్టర్ టి.జాన్ కిరణ్, అకడమిక్ అధికారి ఇ.వరప్రసాద్‌లు హాజరయ్యారు. బుధవారం జరిగిన పరిశీలనలో బాగంగా విభాగాల వారీగా కరిక్యులర్, కో-కరిక్యులర్, అదనపు కరిక్యులర్ కార్యక్రమాల రికార్డులను పరిశీలించారు. అలాగే కళాశాలలో ఉన్న లైబ్రరీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఐక్యూఎసి నిర్వహణను పరిశీలించారు. లోపాలను గుర్తించిన బృంద సభ్యులు వాటిని సరిదిద్దుకునేలా పలు సూచనలు చేశారు. కళాశాలలో వివిధ కోర్సుల్లో చదువుతున్న విద్యార్థినులతో వారు మాట్లాడి మౌలిక అంశాలపై చర్చించారు. అనంతరం బృందం సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుతం కళాశాలకు ఉన్న నాక్ ఎ గ్రేడును నిలబెట్టుకుంటూ స్థాయిని పెంచుకునేందుకు కృషి చేయాలని సూచించారు. కళాశాల అధ్యాపకులు టీం స్పిరిట్‌తో పని చేస్తున్నారని అభినందించారు. ఈ పరిశీలనలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర్ నారాయణ, అకడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్ కృష్ణారావు, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న బృంద సభ్యులు

శంకుస్థాపన చేస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ గీత

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలోని 15వ వార్డు పరిధిలోని కొత్తకోట వారి వీధిలో సిసి కాలువలు, కల్వర్టు పనులకు మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. రూ.1,80,000తో సిసి కాలువలు, కల్వర్టు పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. త్వరలోనే ప్రతి వార్డులో సిసి కాలువలు, రహదారులు వంటి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మొదలవలస రమేష్, సంపదరావు మురళీ, బగాన అమ్మినాయుడు, ఫాతిన రమణమూర్తి, ఇన్‌ఛార్జి కమిషనర్ ఎపిఎస్ జాన్సన్, పివివికె రాజు తదితరులు పాల్గొన్నారు.

బిటి రహదారికి శంకుస్థాపన

మండలంలోని ఈసర్లపేట గ్రామానికి పాలకొండ ప్రధాన రహదారి నుంచి రూ.69 లక్షలతో బిటి రహదారి నిర్మాణానికి పొందూరు మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కూన సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామ రహదారులకు మహర్దశ కలిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి, ఎఇ సత్యనారాయణ, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వేలంపాట ఖరారు

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ రోజువారి మార్కెట్ ఆశీలు పాట ఖరారైంది. మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన కమిషనర్ ఎన్.రామారావు బుధవారం ఆశీలు పాటలు నిర్వహించారు. పలాసకు చెందిన జోగ కృష్ణారావు రూ.16 లక్షలకు వేలం పాట పాడారు. ఆయనకు పోటీగా పిడుగు పాపారావు రూ.15.90 లక్షలకు పాడారు. అదేవిధంగా జంతువధశాలకు నిర్వహించిన వేలంలో రాజేషాఖాన్ రూ.50 వేలుకు దక్కించుకున్నారు. ఏడాది పాటు వీరిద్దరూ మార్కెట్ ఆశీలు వసూళ్ల చేసుకోవచ్చునని అన్నారు.

వేలంపాట నిర్వహిస్తున్న కమిషనర్ రామారావు

రాత్రికి రాత్రే నిర్మాణాలు

మున్సిపల్ నిబంధనలకు తిలోదకాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘం పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా రాత్రికి రాత్రి ఇష్టారాజ్యంగా నిర్మాణాలు జరుపుతున్నప్పటికీ పురపాలక సంఘ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. విఎల్‌టి, నాళా కట్టకుండా వ్యవసాయ భూముల్లో కమర్షియల్ స్థలాలుగా నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు చోద్యం చూడడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఐదేళ్ల వైసిపి పాలనను విమర్శించే ప్రస్తుత కూటమి నాయకులు ఇటువంటి నిర్మాణదారులకు అండదండలు అందిస్తున్నారన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. పురపాలక సంఘంలోని పార్వతీశంపేట రెవెన్యూ పరిధిలోని 22వ వార్డు లక్ష్ముడుపేట పరిధి పాలకొండ ప్రధాన రహదారి పక్క సర్వే నెంబర్ 53లో ఉన్న 22 సెంట్లు స్థలంలో ఒక వ్యక్తి అవుట్ లెట్ టైల్స్ వ్యాపారం పేరుతో గతంలో ఒక నిర్మాణాన్ని చేపట్టాడు. ప్రస్తుతం దాని వెనుక భాగంలో సుమారు 8 సెంట్లు విస్తీర్ణంలో నాళా కట్టకుండా నిర్మాణాలకు మున్సిపల్ అధికారుల అనుమతులు తీసుకోకుండా పక్కా నిర్మాణాలు చేపట్టారు. వివిధ వర్గాల ద్వారా అందుకున్న సమాచారం మేరకు మున్సిపల్ అధికారులు సదరు నిర్మాణదారుడికి నోటీసులు జారీ చేసి నాళాతో పాటు మున్సిపల్ అధికారుల అనుమతులు తీసుకోవాలని సదరు వ్యక్తికి సూచించినప్పటికీ అవేమీ తనకు వర్తించవు అన్నట్లుగా అధికారుల ఆదేశాలను పట్టించుకోకుండా అధికార పార్టీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్న ఆ వ్యక్తి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణాలను పూర్తి చేయడంపై పలువురు పురపాలక సంఘ అధికారుల వ్యవహార శైలిపై విమర్శలు గుప్పిస్తున్నారు. సామాన్య ప్రజలు ఇంటి పన్ను, నీటి పన్ను ఇతర అనుమతులు విషయంలో కొరడా జులిపించే అధికారులు టైల్స్ వ్యాపారం పేరుతో మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతూ భారీ నిర్మాణాలు చేపట్టిన ఇటువంటి వ్యక్తులపై కనీస స్పందన చూపక పోవడంలో ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, పురపాలక సంఘ అధికారులు స్పందించి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మాణాలు జరుపుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకొని విఎల్‌టి, నాళాతో పాటు మున్సిపల్ కార్యాలయానికి రావాల్సిన ఆదాయాన్ని వసూలు చేయాలని పలువురు కోరుతున్నారు.

అనుమతులు లేకుండా నిర్మించిన గోదాము

చర్యలు తీసుకుంటాం

పార్వతీశం పేట సర్వే నెంబర్ 53లో నిర్మాణం చేపడుతున్న వ్యక్తికి ఇప్పటికే ఒకసారి నోటీసు జారీ చేశామని ఇన్‌ఛార్జి టౌన్ ప్లానింగ్ అధికారి చింతాడ నవీన్ కుమార్ తెలిపారు. రెండోసారి నోటీసు ఇవ్వటానికి సిద్ధం చేశామని, ప్రస్తుతం మున్సిపల్ కమిషనర్ సెలవులో ఉండటం వలన ఇవ్వలేకపోయమన్నారు.

క్రైమ్ కార్నర్

విలేకరులతో మాట్లాడుతున్న సిఐ అవతారాం

భార్యపై అనుమానంతోనే హత్య

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని ఎస్.ఎస్.ఆర్ పురంలో మహిళ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్యకు సంబంధించిన వివరాలను సిఐ అవతారం వెల్లడించారు. గాలి నాగమ్మ (42)ను భర్త అప్పలరెడ్డి అనుమానంతోనే హతమార్చినట్లు చెప్పారు. తరుచూ ఇంట్లో ఆమెతో గొడవపడుతూ మానసికంగా వేధించేవాడన్నారు. భార్య నడవడికలో అనుమానం రావడంతోనే కత్తితో దాడి చేసి చంపినట్లు స్పష్టం చేశాడని తెలిపారు. అప్పలరెడ్డిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

కెమికల్ చోరీపై కేసు నమోదు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని పైడిభీమవరంలో ఉన్న డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ లిమిటెడ్ సిటిఒ 6లో మంగళవారం తయారైన మొదటి బ్యాచ్‌లో 320 గ్రాముల సెమాగ్లుటైడ్, రెండో బ్యాచ్‌లో 130 గ్రాముల సెమాగ్లుటైడ్ మొత్తం 450 గ్రాముల బరువు గల కెమికల్ దొంగిలించబడిందని పరిశ్రమ సైట్‌హెడ్ సుందర్ గణేష్ శంకరన్ ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జె.ఆర్.పురం ఎస్ఐ ఎస్. చిరంజీవి తెలిపారు.

లైంగిక దాడి ఘటనపై డిఎస్‌పి విచారణ

కవిటి: మండలంలో కలకలం రేపిన బాలికపై అత్యాచార ఘటనపై పలాస డిఎస్‌పి పి. వెంకట అప్పారావు బుధవారం విచారణ చేపట్టారు. ఇచ్ఛాపురం సిఐ చిన్నంనాయుడుతో కలిసి ఆర్.తొత్తిడిపుట్టుగను సందర్శించారు. బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడి సమాచారం సేకరించారు. ఈ సందర్భంగా బాలిక తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తూ తమ గోడు వెళ్లబోసుకుంది. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి మరింత సమాచారం తెలుసుకున్నారు.

దగ్ధమవుతున్న బైక్

ద్విచక్ర వాహనం దగ్ధం

పలాస : మొగిలిపాడు జాతీయ రహదారిపై మండలంలోని రామకృష్ణాపురానికి చెందిన విశ్వనాథం ద్విచక్ర వాహనం బుధవారం దగ్ధమైంది. పలాస నుంచి మొగిలిపాడు బైక్‌పై వెళ్తుండగా... షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు వ్యాపించాయి. దీనిని గమనించిన వాహనదారుడు అప్రమత్తమై బైక్‌ను విడిచిపెట్టి పారిపోయాడు. అనంతరం వాహనం పూర్తిగా కాలి బూడిదైంది. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేలంపాటకు సిద్ధంగా ఉన్న టేకు దుంగలు

రేపు టేకు దుంగల వేలం

బూర్జ: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం టేకు దుంగల వేలం పాట నిర్వహించనున్నట్లు తహశీల్దార్ పద్మావతి తెలిపారు. గతేడాది ప్రభుత్వ భూముల్లో ఉన్న 13 టేకు చెట్లను 66 ముక్కలుగా అక్రమంగా నరికివేసి తరలించేందుకు సిద్ధంగా ఉండడంతో వచ్చిన సమాచారం మేరకు వాటిని స్వాధీనం చేసుకొని తహశీల్దార్ కార్యాలయంలో భద్రపర్చారు. వీటిని వేలం పాట ద్వారా విక్రయించి వచ్చిన మొత్తాన్ని గవర్నమెంట్ హెడ్ ఆఫ్ అకౌంట్‌కు జమ చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

కవి సమ్మేళనానికి అమ్మోజీకి ఆహ్వానం

రణస్థలం: విశ్వావసు సంవత్సరం ఉగాది సందర్భంగా 'ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం' నిర్వహిస్తున్న జాతీయ కవి సమ్మేళనానికి జిల్లా నుంచి వర్ధమాన రచయిత్రి, కోష్ట సచివాలయం మహిళా పోలీస్ ఒమ్మిడి అమ్మోజీ ఎంపికయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ మాడభూషి సంపత్ కుమార్ బుధవారం అమ్మోజీకి ఆహ్వానపత్రం పంపించారు. పల్లె జీవన విధానం, వలస బతుకులపై రాసిన 'పల్లె గూటికి పండగొచ్చింది' కవితను ఉత్తమ కవితగా ఎంపిక చేశామన్నారు. మార్చి 28న శుక్రవారం నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని ప్రాచీన తెలుగు కేంద్రంలో జరిగే కవి సమ్మేళనంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి సంప్రదాయబద్ధంగా సత్కరిస్తామని తెలిపారు.

లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం

కొత్తూరు : విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో మీసేవ కేంద్రాలను పునరుద్ధరిస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకున్నారని మండల మీసేవ అధ్యక్షులు అల్లు భగవాన్ అన్నారు. ఈ మేరకు లోకేష్ చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి హయాంలో మీసేవా కేంద్రాల ద్వారా సేవలందిస్తూ విషయం పాఠకులకు తెలిసిందేనన్నారు. 2019లో వైసిపి ప్రభుత్వం వచ్చి మీసేవా కేంద్రాలను నిలిపివేసిందని తెలిపారు. దీంతో మీసేవా నిర్వాహకులు రోడ్డున పడ్డారని అన్నారు. ఈ విషయాన్ని యువగళం పాదయాత్రలో మీ సేవా నిర్వాహకులు లోకేష్ దృష్టి తీసుకెళ్లామన్నారు. ప్రభుత్వం మీసేవా కేంద్రాలను పునరుద్ధరిస్తామని ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేశారు.

చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న భగవాన్

మాట్లాడుతున్న జగన్మోహనరావు

ప్రథమ చికిత్సపై పూర్తిస్థాయి అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రథమ చికిత్సపై యువత అవగాహన కలిగి ఉండాలని, ప్రమాద సమాయాల్లో అత్యవసరంగా చికిత్స అందించి ప్రాణాలు కాపాడడంలో ఎంతగానో ఉపకరిస్తుందని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. బుధవారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన ప్రథమ చికిత్సపై నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ శిక్షణా తరగతుల్లో 20 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ నెల 26 వరకు శిక్షణ కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రమాద సమయాల్లో ప్రజలను ఆదుకోవాలని సూచించారు. ప్రథమ చికిత్సపై డాక్టర్ శ్రీకాంత్, ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ, కో-ఆర్డినేటర్ సత్యనారాయణ తరగతులను నిర్వహిస్తున్నారు. హై బిపి, గుండెపోటు, సిపిఆర్ ప్రక్రియపై అవగాహన, ఆపద సమయాల్లో గాయాలకు కట్లు కట్టుట, పాము కాటు, తేలు కాటు, గుండెపోటు వచ్చిన వారికి ప్రథమ చికిత్స, కరెంట్ షాకు తగిలిన వారికి చికిత్స, రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు, ఫిట్స్ రోగులకు ప్రథమ చికిత్స అందించడంపై శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో కళ్యాణ్, బి.చిన్మయరావు, నర్సింగరావు, గుణాకరరావు, పి.చైతన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీకాలు వేయిస్తున్న కరుణాకరరావు

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

గాలికుంటు వ్యాధిపై పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని పాతపట్నం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు అన్నారు. మండలంలో ముక్తాపురంలో నిర్వహించిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి పశువుల్లో ఈ గాలి కుంటు వ్యాధి సోకడం వల్ల పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోవడం, విదేశాల్లో పాల ఉత్పత్తులకు గిరాకీ లేకుండా పోతుందని అన్నారు. నాలుగు నెలలు దాటిన తమ పశువులన్నిటికీ ఈ గాలిగుంటు వ్యాధి నివారణ టీకాలు కచ్చితంగా వేయించుకోవాలన్నారు. మండలంలో 15,200 పశువులకు టీకాలు వేయడం లక్ష్యం కాగా, ఇప్పటివరకు 9,162 టీకాలు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ అలిఖాన జయప్రద, గ్రామ పెద్దలు ధర్మాన రమేష్, విష్ణుప్రసాద్ పండా, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ రాస, సిబ్బంది రాధ, ఢిల్లీ, చిన్నారావు, వెంకటరావు పాల్గొన్నారు.

గ్యాస్‌కు అదనపు వసూళ్లపై చర్యలు

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని వివిధ కంపెనీల ద్వారా గ్యాస్ ఏజెన్సీలను నిర్వహిస్తున్న వారు వినియోగ దారుల నుంచి గ్యాస్ సిలిండర్ చార్జీలకు తోడు అదనపు వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, అటువంటి ఏజెన్సీలపై చర్యలు తప్పవని పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ సనపల చక్రవర్తి హెచ్చరించారు. బుధవారం నగరంలోని దేవిప్రసాద్, హెచ్‌పి, భారత్ గ్యాస్ ఏజెన్సీలను ఆయన సందర్శించి డెలివరీ బాయ్స్‌తో సమావేశం నిర్వహించారు. ఇటీవల నగరానికి చెందిన వినియోగదారులు అదనపు వసూళ్లపై నేరుగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఫిర్యాదు చేశారని, అందులో భాగంగా ఏజెన్సీల యాజమాన్యాల నుంచి వివరణ కోరినట్టు తెలిపారు. అదనపు వసూళ్ల వల్ల లబ్ధిదారులపై భారం పడుతోందని, దీనివల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరదన్నారు. అందువల్ల యాజమాన్యాలు, డెలివరీ బాయ్స్ వినియోగదారులకు సరఫరా చేసేటప్పుడు అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. గ్యాస్ డీలర్ల ప్రతినిధి డబ్బీరు వాసు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చక్రవర్తి

రాజీనామాను గోవిందరాజులు వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్ష పదవికి బోయిన గోవిందరాజులు చేసిన రాజీనామాను ఉపసంహరించుకోవాలని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు కోరారు. నగరంలోని కళింగ వైశ్య కళ్యాణ మండపంలో రాష్ట్ర కళింగ కోమటి సంఘం మహాసభ బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉత్తరాంధ్రలోని కళింగ కోమటి సంఘ ప్రతినిధులు ముక్తకంఠంతో ఆయన్నే తిరిగి రాష్ట్ర అధ్యక్షునిగా కొనసాగాలని తీర్మానించారు. అందువల్ల సభ్యుల అభ్యర్థన మేరకు రాజీనామాను వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సామాజిక తరగతికి ఎల్లప్పుడూ ప్రయోజనం చేకూర్చడానికి నిరంతరాయంగా కృషి చేస్తున్న ఆయనపై

శ్రీనివాసరావును సత్కరిస్తున్న కళింగ కోమట్లు

ఉద్దేశ్య పూర్వకంగా కొందరు సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేయడం వల్లే మానస్తాపానికి గురై రాజీ నామా చేశారన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవంతో పాటు సామాజిక తరగతి బిసి జాబితాలో చేర్చడానికి ఆయన చేసిన కృషిని గుర్తు చేశారు. ప్రస్తుతం ఒబిసి సాధన కోసం కృషి చేస్తున్న సమయంలో ఇలాంటి వ్యాఖ్యలు సరికాదన్నారు. సామాజిక తరగతి సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయన రాజీనామా రాజకీయ సమస్యగా మారిందని, ఈ పరిస్థితికి ఎవరు తీసుకొచ్చారో ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు.

నాయకత్వాన్ని అగౌరవ పర్చే రీతిలో వ్యవహరించడం తగదన్నారు. దీనివల్ల సామాజిక వర్గం నష్ట పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటి వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావును సత్కరించారు. సమావేశంలో కోరాడ హరిగోపాల్, కోణార్క్ శ్రీను, కోరాడ రమేష్, అందవరపు సంతోష్, అందవరపు ప్రసాద్, పివి రమణ పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న జెడ్‌పిటిసి యశోద

జెడ్‌పిటిసి పరామర్శ

సోంపేట : మండలంలోని కొర్లాంకు చెందిన వైసిపి నాయకుడు గుడియా కృష్ణారావు, కొర్లాం పంచాయతీ లక్ష్మీపురానికి చెందిన భార్యాభర్త తామడ గణపతి, భారతమ్మలు కొద్దిరోజుల వ్యవధిలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్‌పిటిసి తడక యశోద, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు బుధవారం బృతుల కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

వాడాడలో గ్రామదేవత ఉత్సవాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గార మండలం వాడాడలో చిన్నమ్మతల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సుంకాన సురేష్ ఆధ్వర్యాన సమిష్టిగా గ్రామస్తులు ఈ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో నీలమ్మ సంబరం, ఉజిడి బండి ఊరేగింపు, చెక్క భజన, కోలాటం, సాము గరిడీలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఎరుకు నాయుడు, అప్పల సూరి, చిన్నప్పుడు, కమిటీసభ్యులు, మాజీ వైస్ ప్రెసిడెంట్ చింతు తాతారావు, మాజీ ఎంపిటిసి చింతనిప్పుల వెంకటరమణ, మండ వెంకట గణేష్ బాబు (భుక్త) తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

కవిటి: మండలంలోని బొరివంక ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ ధనుంజయ మజ్జి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం పరిశీలించి, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి ప్రతిభా పాటవాలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులతో మమేకమై పాఠాలు బోధించాలని సూచించారు. అదే సమయంలో ఎస్‌ఎస్‌ఎ ఆదేశాల మేరకు సిఆర్‌ఎంటి బి.తులసీదాస్ మండలంలోని ఆరు పాఠశాలల్లో సోషల్ ఆడిట్ నిర్వహించి సంబంధిత సమాచారం యాప్‌లో నిక్షిప్తం చేశారు.

పన్ను వసూలు వేగవంతం

ఇచ్ఛాపురం : ఇంటి, నీటి, ఖాళీ స్థలాలు తదితర పన్నులు వేగవంతం చేయాలని కమిసనర్ రమేష్ ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెలాఖరి లోగా శతశాతం వసూలు చేయాలన్నారు. ఇప్పటి వరకు రూ.181.25 లక్షలు వసూలు కాగా, రూ.135.18 లక్షలు బకాయి ఉందన్నారు. సమావేశంలో మేనేజర్ అప్పలస్వామి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.మోహన్, సెక్రటరీలు పాల్గొన్నారు.

జిల్లా యూనిట్‌గా ఎస్‌సి వర్గీకరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణకు రాష్ట్ర యూనిట్‌ను పరిగణలోకి తీసుకోవడం వల్ల మాల, రెల్లి వంటి వర్గాలకు తీవ్ర నష్టం జరుగుతుందని, అందువల్ల జిల్లా యూనిట్‌గా ఎస్‌సి వర్గీకరణ చేపట్టాలని ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సమితి నాయకులు కంఠ వేణు, తైక్వాండో శ్రీను మాట్లాడుతూ రాష్ట్ర యూనిట్‌గా ఎస్‌సి వర్గీకరణ చేయాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి వర్గాలకు 15 శాతం రిజర్వేషన్లు అందేలా వర్గీకరణ ఉండాలని, లేనిపక్షంలో జిల్లా యూనిట్‌గా వర్గీకరణ చేపట్టాలని కోరారు. జిల్లాలో 18 శాతం ఉన్న రెల్లి, అనుబంధ కులాలకు తీరని నష్టం జరుగుతోందన్నారు. విభజనపై

జెసికి వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం జెసి ఫర్మాన్ అహ్మద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అర్జీ ఈశ్వరరావు, జలగడుగుల గోవిందరావు, శ్రీరామ, గొల్లపల్లి మోహన్, రామ్మోహనరావు, చిన్న, కె.కూర్మారావు, కళ్యాణి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జీడి, మామిడి సస్యరక్షణపై అవగాహన

పర్యటిస్తున్న అధికారులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని అమలపాడులో ఉద్యానశాఖ ఆధ్వర్యాన జీడి, మామిడి సస్యరక్షణ చర్యలపై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఉద్యానవనశాఖ సహాయ సంచాలకులు కె.శైలజ, హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్ పెద్దపేట శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ కలిసి తోటలను సందర్శించారు. జీడి తోటల్లో ప్రస్తుతం రసం పీల్చే పురుగు పిండి నల్లి వ్యాప్తిపై రైతులు వారి వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులు పిండి నల్లి నివారణా చర్యల గురించి వివరించారు. జీడి, మామిడి తోటలో పూతపై ఉన్న తెల్లని బూజు లో పిండి నల్లి అనే రసం పీల్చే పురుగు ఉండటం వల్ల పూత నాశనం అవుతుందని అధికారులు తెలిపారు. ఎక్కువగా సింథటిక్ క్రిమిసంహారక మందులు వాడటం వల్ల పిండినల్లిని తినే సహాయక పురుగులు నాశనం చేయడంతో పిండి నల్లి ఉధృతి పెరిగిందని అన్నారు. దీని నివారణకు సబ్బు ద్రావణము స్ప్రే చేసిన తర్వాత ప్రొఫెనోఫోస్ రెండు ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ముందస్తుగా వేపనూనె, వేపసబ్బు, కనుగనూనె బాగా కలిపి ఐదు ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసినట్లయితే ఉధృతి తగ్గుతుదన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యానశాఖ అధికారి సునీత, విలేజ్ హార్టికల్చర్ సహాయకులు అవినాష్, ప్రశాంత్ సంతోష్, మహాలక్ష్మి పాల్గొన్నారు.

సునీతా విలియమ్స్ రాకపై హర్షం

కవిటి: భారత సంతతి వ్యోమగామి సునీత విలియమ్స్ బృందం సురక్షితంగా భూమ్మీదకు చేరుకోవడంపై ప్రపంచవ్యాప్తంగా సంతోషం వెల్లివిరుస్తోంది. ఈ నేపథ్యంలో స్థానిక కళ్యాణి ఆంగ్ల పాఠశాలలో విద్యార్థులు జాతీయ జెండా చేతపట్టి కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బిందు మాధవి, ఎఒ రాణి మాట్లాడుతూ సునీత విలియమ్స్ భూమిపైకి ఇన్ని నెలల తరువాత సురక్షితంగా చేరుకోవడం శుభపరిణామని అన్నారు.

వ్యోమగాములకు స్వాగతం

టెక్కలి రూరల్ : నాసా ప్రయోగించిన అంతరిక్ష వ్యోమగాముల్లో భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్, విల్మోర్ ఇతరులు 9 నెలల సుదీర్ఘ నిరీక్షణ తరువాత అంతరిక్షం నుండి సురక్షితంగా భూమిపైకి

హర్షం వ్యక్తం చేస్తున్న చిన్నారులు

చేరుకోవడంపై ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు హర్షం ప్రకటించారు. ఈ మేరకు గ్రంథాలయం ఆధ్వర్యాన గ్రంథాలయాధికారి డాక్టర్ ఎం.సుబ్బారావు ఇతర సిబ్బంది బ్యాన్ ద్వారా స్వాగతం పలికారు. కార్యక్రమంలో షణ్ముఖరావు, మోహన్, వెంకటేష్ పాల్గొన్నారు.

చిన్న శ్రీను తనయుడు మృతి బాధాకరం

ఆమదాలవలస : విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షుడు, భీమిలి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు రెండో కుమారుడు ప్రణీత్ మృతి బాధాకరమని కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. నాలుగు సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రణీత్ మృత్యువుతో పోరాడి బుధవారం విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రాణాలు కోల్పోయాడన్న విషయాన్ని తెలిసి తాను చలించిపోయానని ఆమె తెలిపారు. ఆ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

మజ్జిగ పంపిణీ

కవిటి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల సమయంలో ఎండ తీవ్రత దృష్ట్యా బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద మొదటి రోజు నిమ్మకాయ సబ్జా రసం అందించిన గ్రామ యువత రెండో రోజు మజ్జిగ పంపిణీ చేసింది. ఈ సందర్భంగా రెండో రోజు గ్రామానికి చెందిన మణిహాసిని కిరాణా జనరల్ స్టోర్స్ యజమాని సింహాద్రి కిరణ్ ఆర్థిక సాయంతో 350 మంది విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువతతో పాటు ఆడ పిల్లలు కూడా మేము సైతం సామాజిక సేవలో భాగస్వాములం అవుతామంటూ తమవంతు పాత్ర పోషించారు. అనంతరం గ్రామ యువత మాట్లాడుతూ దాతల సహకారంతో పదో తరగతి పరీక్షలు పూర్తయ్యే వరకూ ఈ కార్యక్రమం నిరాటంకంగా కొనసాగిస్తామని తెలిపారు.

వేలంపాట 22కి వాయిదా

నరసన్నపేట : నరసన్నపేటలోని వారపు సంత, ట్యాక్సీ స్టాండ్ ఏడాది పాటు ఆశీలు వసూళ్ల నిమిత్తం నిర్వహించిన వేలంపాట ఈ నెల 22కి వాయిదా వేసినట్లు ఇఒ పి.ద్రాక్షాయిని తెలిపారు. నరసన్నపేట పంచాయతీ కార్యాలయంలో ఇఒ ఆధ్వర్యాన బుధవారం వేలంపాట నిర్వహించారు. ఇందులో భాగంగా ఈ ఏడాదికి రూ.25 లక్షలు ప్రభుత్వ పాటగా ప్రకటించారు. పాటలో పాల్గొన్న వారు రూ.23 లక్షలు వరకు పాడి ఆగిపోయారు. ఆ మొత్తానికి పాడేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో మరలా 22కి వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎస్.కృష్ణబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పి.వి.ఆర్ పరామర్శ

లావేరు : ఉత్తరాంధ్ర తెలగ సంఘం నాయకులు పల్లంట్ల వెంకట రామారావు (పివిఆర్) బుధవారం మండలంలోని పలువురిని పరామర్శించారు. గుమ్మడాంకు చెందిన వైసిపి నాయకులు యినపకుర్తి పాపారావు భార్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన పాపారావును పరామర్శించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. అలాగే లావేరు పంచాయతీ లావేటిపాళెంకు చెందిన లంకలపల్లి సత్యనారాయణ మునసిబు కుమారుడు లంకలపల్లి కృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన కుమారుడు లంకలపల్లి సురేష్‌ను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. కనకరాజు, ముప్పిడి శ్రీరాములు, పిడుగు శ్రీనివాసరావు తదితరులున్నారు.

మోహన్‌బాబు యూనివర్సిటీ సందర్శన

రణస్థలం రూరల్ : తిరుపతిలోని మోహన్‌బాబు యూనివర్శిటీని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ తేజబాబు బుధవారం సందర్శించారు. మోహన్ బాబు విశ్వవిద్యాలయం ఛాన్సలర్ మోహన్‌బాబు, మంచు విష్ణుతో సమావేశమయ్యారు. విద్యా విధానం, అమలు చేస్తున్న బోధనా పద్ధతులు, ఆహ్లాదకర వాతావరణం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్రలో ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ స్థాపించినందుకు, విద్యలో కొత్త ప్రమాణాలను నెల కొల్పినందుకు, ఉత్తరాంధ్రలోని విద్యార్థులకు ధృడమైన పునాదిని అందించినందుకు మోహన్‌బాబు ఎన్ఇఆర్‌ను ప్రశంసించారు. వీరితో పాటు వి.జె.ఎస్.ఎల్.పి.మౌళి ఉన్నారు.

స్టాపర్స్ ఏర్పాటు

పొందూరు: మండలం కేశవదాసుపురం జంక్షన్‌లో ఎన్ఎసిఎల్ కంపెనీ సౌజన్యంతో బుధవారం స్టాపర్స్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. చిలకపాలెం-పొందూరు రహదారిలోని కేశవదాసుపరం జంక్షన్‌లో రహదారి ప్రమాదాల నివారణకు వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఈ స్టాపర్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.